ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
07-11-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 62 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి



# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్

**భార్య మెలానియా, ఎలాన్ మస్క్ లకు ట్రంప్ థాంక్స్**
**అమెరికాకు స్వర్ణయుగం.. ఓటర్లకు కృతజ్ఞతలు**

2024 అమెరికా ఎన్నికల్లో విజయం సాధించినట్లు ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ తన ప్రసంగంలో ఎలన్ మస్క్ పై ప్రశంసలు కురిపించారు. తన ప్రచారానికి మద్దతుగా నిలిచిన టెక్ బిలియనీర్ మస్క్ ను 'సూపర్ జీనియస్', 'స్పెషల్ బాయ్'గా అభివర్ణించారు.

...మిగతాది 2 లో



## అసలు నువ్వు ఎప్పుడు జైలుకు వెళ్తావో చూసుకో..

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:**

: వాడు అరెస్టు అయితడు.. వీడు అరెస్టు అయితడు అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందరి జాతకాలు చెబుతున్నాడు.. అసలు నువ్వు ఎప్పుడు జైలుకు వెళ్తావో చూసుకో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఇవాళ మీడియాతో మాట్లాడారు.వీడు జైలుకు పోతడు.. వాడు జైలుకు

...మిగతాది 2 లో




**పదెకరాలకే రైతు భరోసా..!**

**మార్గదర్శకాలు సిద్ధం అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్న సర్కార్**

**నెలాఖరులోపు పెట్టుబడి సాయం షురూ.**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాపై దృష్టి సారించింది. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు తీపి కబురు చెప్పింది.**

**జయభేరి, హైదరాబాద్:**

రైతు భరోసాకు పదెకరాల వరకు కటాఫ్ విధించాలని నిర్ణయించింది. ఈమేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘం నివేదికను సమర్పించినట్టు తెలిసింది. నివేదికలోని కీలకమైన మార్గదర్శకాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు ఐదేండ్లలో రైతు బంధు పేరిట దాదాపు రూ.20వేల కోట్లను వ్యవసాయేతర భూములకు ఇచ్చి ప్రజా సొమ్మును వృధా చేసిందని పెట్టుబడి సాయంలో 96శాతం రైతులకు మేలు చేసేందుకు సర్కారు సిద్ధమవుతున్నదని సీఎం రేవంత్రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు గత సర్కార్ హయాంలో రాళ్లు, రప్పల భూములు, గుట్టలు, హైవేలు, రోడ్లు, వెంచర్లు, భూ సేకరణ కింద పోయిన భూములకు వేల కోట్ల రూపాయలు

...మిగతాది 2 లో

## ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం



**జయభేరి, విజయవాడ, నవంబర్ 6:**

ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఏపీ జీఎస్టీ 2024 చట్ట సవరణ, 2014 18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 చట్టం ఉపసంహరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భూకబ్జాదారులపై కేసులు పెట్టడానికి నిబంధనలు అడ్డంకిగా ఉండడంతో రెవెన్యూ శాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో త్వరలో జరిగే శాసనసభలో పాత చట్టం రద్దు, కొత్త చట్టం రూపకల్పన చేయనున్నారు. అలాగే, ఏపీ రాజధాని ప్రాంత పరిధిని

...మిగతాది 2 లో

## ఇక సినిమా చూపించబోతున్న హైడ్రా




**జయభేరి, హైదరాబాద్:**

అక్రమణలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా.. కాస్త విరామం ఇచ్చింది. అతి త్వరలో అంతకుమించి అనేలా యాక్షన్ షురూ చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా మియాపూర్ స్టాలిన్‌నగర్‌లోని సర్వే నంబర్ 100, 101లపై దృష్టి సారించింది. ఈ సర్వే నంబర్లలో దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వంద ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడా భూములపైనే ఆరాతీస్తోంది హైడ్రా.ఉమ్మడి రాష్ట్రంలో మియాపూర్ భూముల్ని వేలం వేసేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. అయితే సుప్రీంకోర్టులో కేసులు ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. ఈ క్రమంలో అధికారులు చర్యలు తీసుకుంటే బాగానే ఉండేది. కానీ అంతులేని నిర్లక్ష్యం వహించడంతో కబ్జాకోరులు పేట్రేగిపోయారు. పక్కా సర్వే నంబర్లు, బై నంబర్లతో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక మియాపూర్ భూములు తమకు ఇవ్వాలంటూ వేలాది మంది మహిళలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం అప్పట్లో హెచ్ఎండీఏను ఉలిక్కిపడేలా చేసింది. మొదట్లో గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నించారు వాళ్లంతా. ఆ తర్వాత గుడి నిర్మాణానికి సిద్ధమయ్యారు. వారిని సముదాయించేందుకు పోలీసులు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. 144 సెక్షన్ విధించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో

...మిగతాది 2 లో



## 100 కోట్ల స్ట్రాటజీ లెక్కలు చెప్పిన పీకే

**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 6:**

దేశవ్యాప్తంగా కీలక రాష్ట్రాల్లో గెలుపు కోసం పనిచేసిన ఆయన.. 2023లో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఐప్యాక్ వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తానే స్వయంగా ఓ పార్టీని ప్రకటించారు. జన సూరజ్ పేరిట కొత్తగా పార్టీని పెట్టారు. ఈ మేరకు బిహార్ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆయన పాదయాత్ర సైతం చేశారు. సక్సెస్‌ఫుల్ ఎన్నికల స్ట్రాటజిస్ట్‌గా ప్రశాంత్ కిషోర్‌కు మంచి పేరుంది. ఆయన ఏ రాష్ట్రంలో ఏ పార్టీ తరఫున పనిచేసినా.. అక్కడ ఆ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్న భరోసా ఉంది. అలా దేశవ్యాప్తంగా ఆయన పలు కీలక పార్టీలకు సలహాదారుగా పనిచేశారు. అంతేకాకుండా 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలో రావడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. బీజేపీకి సలహాదారుగా పనిచేసి.. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఎంతగానో దోహదపడ్డారు. అలాగే.. 2019 ఎన్నికల్లో

...మిగతాది 2 లో

## తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటింటి సర్వే



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:**

తెలంగాణలో సమగ్ర సర్వే ప్రారంభమైంది. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సర్వేను ప్రారంభించారు. వివిధ జిల్లాల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇంట్లో ఉన్న సభ్యుల వివరాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులు, ఉద్యోగ, రాజకీయ నేపథ్యంపై కూడా ప్రశ్నలు ఉన్నాయి. ఒక ఫ్యామిలీకి సంబంధించిన అన్ని రకాల వివరాలు తెలుసుకునేలా ఈ సర్వే ప్రశ్నావళిని రూపొందించారు. మొత్తం 75 ప్రశ్నలతో ఈ సర్వే కొనసాగుతోంది. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత యజమాని సంతకం అధికారుల సంతకం తీసుకుంటారు.

...మిగతాది 2 లో

## కేంద్రంలో 9. 7 లక్షల ఖాళీ

▶▶ మొదటిపేజీ తరువాయి

## అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఇద్దరు వ్యక్తులను రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. తన విజయంలో తన భార్య మెలానియా, టెక్ బిలియనీర్, తన స్నేహితుడు ఎలాన్ మస్క్ లకు ప్రధాన పాత్ర ఉందన్నారు. మెలానియా రాసిన పుస్తకాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విజయం ఖాయమైన అనంతరం డొనాల్డ్ ట్రంప్ నవంబర్ 6న వేదికపైకి వచ్చి తన విజయాన్ని ఘనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమెరికాకు స్వర్ణయుగాన్ని తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేశారు. "మునుపెన్నడూ ఎవరూ చూడని ఉద్యమం ఇది, నిజం చెప్పాలంటే ఇది రాజకీయంగా జరిగిన గొప్ప ఉద్యమం అని నేను నమ్ముతున్నాను. ఈ దేశంలో ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తన విజయ ప్రసంగంలో ఎలాన్ మస్క్ పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. తన ప్రచార కర్తల్లో మస్క్ అత్యంత సమర్థవంతమైనవాడని అన్నారు. తన ప్రచారానికి మస్క్ ఆర్థికంగా కూడా సహకరించాడని వెల్లడించారు. "అతనో ప్రత్యేకమైన వ్యక్తి, సూపర్ జీనియస్. మన మేధావులను మనం కాపాడుకోవాలి. అలాంటివారు మన దగ్గర ఎక్కువగా లేరు. మన సూపర్ మేధావులను మనం కాపాడుకోవాలి" అన్నారు. పెన్సిల్వేనియాలో ట్రంప్ ప్రచారానికి మస్క్ మిలియన్ డాలర్లు వెచ్చించారు. 20 సంవత్సరాలలో పాపులర్ ఓటును గెలుచుకున్న మొదటి రిపబ్లికన్ గా ట్రంప్ రికార్డు సృష్టించారు. 2004లో జార్జి డబ్ల్యూ బుష్ తర్వాత 2016లో ట్రంప్ సహా ఏ రిపబ్లికన్ కూడా పాపులర్ ఓట్లను గెలుచుకోకపోవడం గమనార్హం. విజయం సాధించిన అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, "ఇప్పుడు అమెరికా ఒక కొత్త స్థాయికి చేరుకోబోతోంది. మేము మా దేశానికి సహాయం చేయబోతున్నాము. మన దేశానికి సాయం చేస్తాం. మనం మన దేశాన్ని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. మన సరిహద్దులను చక్కదిద్దుకుందాం. మన దేశానికి సంబంధించిన ప్రతిదీ మేం చక్కదిద్దుకుందాం. ఈ రాత్రికి ఒక కారణంతో చరిత్ర సృష్టించాం. ఎవరూ ఊహించని అడ్డంకులను అధిగమించాం. అత్యంత నమ్మశక్యం కాని రాజకీయ లక్ష్యాన్ని సాధించాం" అని ట్రంప్ అన్నారు.

"మీ 47వ అధ్యక్షుడు, 45వ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు అమెరికా (us presidential elections 2024) ప్రజలకు, ప్రతి పౌరుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను, నేను మీ కోసం, మీ కుటుంబం కోసం, మీ భవిష్యత్తు కోసం పోరాడతాను. ప్రతిరోజూ, నేను మీ కోసం పోరాడతాను మరియు నా శరీరంలోని ప్రతి శ్వాసతో, మా పిల్లలకు అర్హమైన, మీకు అర్హమైన బలమైన, సురక్షితమైన మరియు సంపన్నమైన అమెరికాను అందించే వరకు నేను విశ్రమించను. ఇది నిజంగా అమెరికా స్వర్ణయుగం అవుతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

## నువ్వు ఎప్పుడు జైలుకు వెళ్తావో..

పోతడు అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందరి జాతకాలు చెబుతున్నాడు. నువ్వు ఎప్పుడు పోతావో చూస్కో.. నువ్వు హోం మంత్రివా.. డీజీపీవా.. నువ్వు ఎవడు.. ఎవరు అరెస్టు అయితరు.. ఎప్పుడు అరెస్టు అయితరు అని చెప్పడానికి..? నువ్వు, నీ ముఖ్యమంత్రి కేక్ కోసుకుని తిన్నట్టు కోసుకొని తినండి. రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి చేయండి. నీ కుటుంబ కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చి దండుకో. కానీ జైలుకు మాత్రం వేరేవాళ్లు వెళ్లాలి. ఇదేనా నీ నీతి.. నీ ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి..? అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. నీ కంపెనీకి కనీసం ఆఫీస్ ఆఫ్ బెన్ ఫిట్ అని కూడా పట్టించుకోకుండా ఏ విధంగా పనులు కట్టబెడతారు. రేవంత్ రెడ్డి, మేఘా కృష్ణారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమృత్ టెండర్లను కూడా పొంగులేటి కంపెనీకి ఇచ్చారు. రాఘువ కంపెనీని కూడా గతంలో రేవంత్ రెడ్డి తిట్టాడు. ఇప్పుడు మాత్రం ఆ కంపెనీకి పనులు ఇస్తున్నాడు. మూసీని కూడా టెండర్లు కాకముందే మేఘాకు ఇవ్వాలని అన్ని ఏర్పాట్లు చేసేశారని కేటీఆర్ తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై ఇప్పటి వరకు ఎందుకు బీజేపీ మాట్లాడటం లేదు. అదానీతో మీ సంబంధాలు ఏ విధంగా బలపడుతున్నాయో మాకు తెలుసు. మీ కుంభకోణాలను బయట పెడుతున్నందుకు మమ్మల్ని ఇబ్బంది పెట్టే పని చేస్తారు. అయిన సరే ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఈడీ దాడులపై ఇప్పటి వరకు స్పందించకపోవటం అంటే బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయ్యిందన్నది స్పష్టంగా తెలిసిపోతుంది. ఎవ్వరు, ఎప్పుడు అరెస్ట్ అవుతారో మంత్రి చెబుతాడా..? వీళ్లు ప్రభుత్వం నడుపుతున్నారా- - -సర్కస్ నడుపుతున్నారా..? అని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు.

## పదెకరాలకే రైతు భరోసా..!

రైతుభరోసా కింద వథాగా చెల్లించినట్లు తేల్చింది. రైతులకు పంట పెట్టుబడి సాయం ఈ నెలాఖరు నుంచి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. కానీ దాన్ని వానాకాలం నుంచి లెక్కగట్టి ఇస్తారా? లేక ఈ యాసంగి నుంచి రైతు భరోసా జమ చేస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు. అయితే రైతు భరోసాకు నిధులను సర్దుబాటు చేయాలంటూ ఆర్థిక శాఖను సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికే ఆదేశించినట్టు సమాచారం. ఎప్పటి మాదిరిగానే ఒక ఎకరా నుంచి మొదలు పెట్టాలనీ, డిసెంబర్ నెలాఖరు వరకైనా సరే రైతుల ఖాతాలకు నిధుల జమ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. వాస్తవానికి దసరా తర్వాత నుంచే రైతు భరోసా పంపిణీ చేయాలని తొలుత ప్రభుత్వం భావించింది. కానీ, అప్పటికే రుణమాఫీ కోసం రూ.18 వేల కోట్లు రైతులకు విడుదల చేసింది. దీంతోపాటు మరికొన్ని స్కీములకు నిధులు సర్దుబాటు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో రైతు భరోసా వాయిదా పడుతూ వస్తున్నది. అయితే డిసెంబర్ నెలలో జరగనున్న స్థానిక ఎన్నికల కంటే ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయనున్నట్టు సమాచారం. ప్రతి 10 రోజులకు రూ.1,500 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల చొప్పున జమ చేసేలా 45 రోజుల్లో కనీసం రూ.7 వేల కోట్లు జమ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సాగు లెక్కల ప్రకారం 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ నేపథ్యంలో రైతు భరోసాలో దుబారాను కట్టడి చేసినా పెట్టుబడి సాయం కోసం దాదాపు రూ. 7వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పుడున్న లెక్కల ప్రకారం ఏడెనిమిది ఎకరాల రైతులకు అంటే దాదాపు 96 శాతం మందికి రైతుభరోసా అందుతుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలనే దానిపై జిల్లాల్లో సభలు నిర్వహించి అభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. చాలా మంది రైతులు 10 ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. మరికొంతమంది రైతులు ఏడున్నర ఎకరాల వరకు ఇవ్వాలని సూచించారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే కటాఫ్ ఎంతవరకు పెట్టాలనే దానిపై మార్గదర్శకాలకు సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసినట్టు సమాచారం. రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీల అభిప్రాయాలు ఇప్పటికే తెలుసుకున్నందున, అవసరమైతేనే అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అసెంబ్లీ సమావేశాలను కూడా ఈ నెల మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నప్పటికీ శాసనమండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్ విదేశీ పర్యటనలో ఉండటంతో వారు తిరిగిరాగానే ఆ సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో రైతు భరోసా మార్గదర్శకాలపై చర్చించే అవకాశం ఉంది. మొత్తానికి వ్యవసాయేతర భూములకు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుభరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించినట్టు వినికిడి. వ్యవసాయ భూముల్లో వెంచర్లు చేసి ప్లాట్లుగా మార్చిన వాటికి నాలా కిందనే పరిగణించనున్నారు. రోడ్లు, ఇరిగేషన్, ఇండ్లు ఇతరత్రా వ్యవసాయేతర భూములకు మళ్లిన వాటిని రైతు భరోసా జాబితా నుంచి తీసేయాలని నిర్ణయించారు. దీంతో చాలా వరకు నిధుల దుర్వినియోగం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

## ఇక సినిమా చూపించబోతున్న హైడ్రా

చివరకు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. పేదల దండయాత్రతో హెచ్ఎండీఏ అధికారుల్లో కదలిక వచ్చింది. ముందుగా భూముల లెక్క తీశారు. రికార్డుల్లో 105 ఎకరాలు మాయమై.. 445 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఉన్న భూమిలో రెండు కోట్ల 65లక్షల రూపాయలతో ఫెన్సింగ్ వేయాలని టెండర్లు పిలిచారు. కానీ ఆ పనులు కూడా పట్టాలెక్కలేదు. చూస్తుండగానే వందెకరాలకు పైగా సర్కారు భూమి.. అక్రమార్కుల పాలయింది. ఎకరాకి కనీసం 30కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో 3వేల కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. లేటెస్ట్ గా ఈ కబ్జాకాండపై గురిపెట్టింది హైడ్రా. ప్రభుత్వ భూమి ఎంత.. కబ్జాకి గురైందన్న వివరాలు సేకరిస్తోంది. సర్వే నంబర్ 100, 101లో ఉన్న భూమి ఎంత? ఎన్ని ఎకరాల్లో నిర్మాణాలు వెలిశాయి? నిర్మాణాలు చేపట్టిన వాళ్లకు రిజిస్ట్రేషన్ చేసిందెవరు? ఏయే స్థాయి అధికారులు సహకరించారన్న కోణంలో హైడ్రా ఆరాతీస్తోంది. కూల్చివేతల మొదలయ్యాక ఎవరైనా కోర్టుకెళ్లినా.. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది హైడ్రా. ఈ సారి కూల్చివేతలు మొదలెడితే.. ఎవరొడ్డొచ్చినా ఆగేదేలే అన్నట్టుగా ముందుకెళ్లాలని భావిస్తోంది హైడ్రా..

# కేంద్రంలో 9. 7 లక్షల ఖాళీ

**కేంద్ర ప్రభుత్వం సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. ఇందుక్కారణం పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండడమే. ప్రతి 4 పోస్టులకు 1 ఖాళీగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వేతనాలు, భత్యాలు అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 2023 మార్చి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 24% పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే మంజూరైన పోస్టుల సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతుందని నివేదిక పేర్కొంది.**




**సదర్‌ను అధికారికంగా నిర్వహించడం వెనక మరో కారణం ఉందట. త్వరలో GHMC ఎన్నికలు రాబోతున్నాయి. గ్రేటర్‌లో జరగనున్న ఎన్నికల్లో యాదవ ఓటర్లను ఆకట్టుకునేందుకే సీఎం సదర్‌ను అధికారికంగా నిర్వహించారన్న టాక్ కూడా ఉంది. ఇలా ఏ చిన్న అంశాన్ని వదులుకోవడం లేదు సీఎం రేవంత్.**

**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 6:** నివేదిక ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంలో మొత్తం 40 లక్షల సాధారణ ఉద్యోగాలు ఉన్నాయి. అంటే ఇవి కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ పరిధిలో ఉన్న సాయుధ బలగాల పోస్టులతో సంబంధం లేనివి. వీటిలో 9.7 లక్షల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. అంటే మొత్తం పోస్టులు 40 లక్షలతో పోల్చితే దాదాపుగా నాలుగో వంతు.ఈ ఖాళీల్లో అత్యధికంగా గ్రూప్C (నాన్ గెజిటెడ్) కేటగిరీలో 33 శాతానికి పైగా ఖాళీలు ఉండగా, గ్రూప్B (గెజిటెడ్)లో 16% వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడడానికి కారణాలను నివేదికలో ప్రస్తావించినప్పటికీ.. నియామక ప్రక్రియలో జాప్యమే ఖాళీల సంఖ్య పెరగడానికి ముఖ్య కారణమని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. పదవీ విరమణల కారణంగా ఏర్పడుతున్న ఖాళీలను ఆ మేరకు భర్తీ చేయకుండా, ఆ పని చేసేందుకు వివిధ ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ ఇవ్వడం కూడా ఒక కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్ పద్ధతిలో కొందరిని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కొందరిని తీసుకుంటున్నాయి. ఈ విధానం ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని చాలా వరకు తగ్గిస్తున్నాయి. మరోవైపు రోజువారీ ప్రభుత్వ కార్యాకలాపాలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. 'పీఎం రోజ్‌గార్ మేళా' పేరుతో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తోంది. అలా నియమించినవారికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను అందించారు. ఇలా ఇప్పటి వరకు 13 రోజ్‌గార్ మేళాలను నిర్వహించగా.. చివరి మేళాలో 51,000 మందికి నియామక పత్రాలను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. కేంద్ర ప్రభుత్వంలో సాయుధ బలగాలను మినహాయించి సాధారణ ప్రభుత్వ ఉద్యోగాల్లో అత్యధిక సంఖ్యలో సిబ్బందిని కలిగిన శాఖలు 5 ఉన్నాయి. వాటిలో మొదటి స్థానం రైల్వేదే. ఆ తర్వాత రక్షణ శాఖ (సివిల్), హోంశాఖ, పోస్టల్, రెవెన్యూ విభాగాలున్నాయి. ఈ 5 విభాగాలు కలిపి మొత్తం సిబ్బంది సంఖ్యాబలంలో 92% ఉన్నాయంటే ఇవి ఎంత పెద్ద విభాగాలో అర్థం చేసుకోవచ్చు. ప్రతి 10 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో దాదాపు 4 ఉద్యోగాలు రైల్వే రైల్వే ఒక్కటే అందిస్తుంది. గణాంకాల ప్రకారం రైల్వే శాఖలో మొత్తం 14.89 లక్షలకు పైగా పోస్టులు ఉండగా.. ప్రస్తుతం ఉన్న సిబ్బంది 11.73 లక్షలు మాత్రమే. అంటే ఒక్క రైల్వే శాఖలోనే 3 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. మరోవైపు హోం మంత్రిత్వ శాఖలో 11.12 లక్షల పోస్టులు ఉండగా.. ప్రస్తుత సంఖ్య 9.84 లక్షల వరకు ఉంది. ఈ లెక్కన ఈ శాఖలో దాదాపు 1.28 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రక్షణశాఖలో ఉన్న సివిలియన్ పోస్టులు 5.77 లక్షలు ఉండగా.. వీటిలో 2.44 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే మాదిరిగా పోస్టల్, రెవెన్యూ విభాగాల్లోనూ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2022,23 ఆర్థిక సంవత్సరంలో జీతం మరియు భత్యం (బోనస్, తాత్కాలిక బోనస్, గౌరవ వేతనం, సంపాదించిన సెలవులు మరియు ట్రావెలింగ్ అలవెన్స్‌లు మినహా) మొత్తం వ్యయం 7 శాతానికి పైగా పెరిగిందని నివేదిక పేర్కొంది. 2022, 23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.56 లక్షల కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడగా.. ఇప్పుడు అది రూ. 2.75 లక్షల కోట్లకు చేరుకుంది. వీటిలో 80% మేర నాలుగు మంత్రిత్వ శాఖలు - రైల్వేలు, రక్షణ (సివిల్), హోం వ్యవహారాలు మరియు పోస్టల్ విభాగాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది.ఇదిలా ఉంటే.. విద్యావ్యవస్థలో ఖాళీలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖలో.. ముఖ్యంగా దేశంలోని 46 సెంట్రల్ యూనివర్సిటీల్లో 27 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. వీటిలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి రిజర్వుడు వర్గాల పోస్టులే ఖాళీగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బదులిస్తూ.. 2014 నాటికి సెంట్రల్ యూనివర్సిటీల్లో మొత్తం 37 శాతం పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అది ఇప్పుడు 26.8% కు చేరుకుందని తెలిపారు. అంటే యూపీఏ హయాంలోనే ఎక్కువ ఖాళీలు ఉండగా.. తాము వాటిని భర్తీ చేస్తూ ఖాళీల సంఖ్యను గణనీయంగా తగ్గించామని వివరించారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## 100 కోట్ల స్ట్రాటజీ లెక్కలు చెప్పిన పీకే

ఏపీలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సలహాదారుగా పనిచేశారు. ఆ సమయంలోనూ జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ తరువాత ఎన్నికల్లో పీకే చంద్రబాబు వెంట నడిచారు. ఆయన సలహాదారుగా పనిచేయడంతో పోయిన ఎన్నికల్లో చంద్రబాబు అధికారాన్ని కైవసం చేసుకున్నారు. ఇక 2015లో బిహార్ ఎన్నికల్లో జేడీయూఆర్జేడీల మహాఘట్ బంధన్‌కు వ్యూహకర్తగా పనిచేశారు. 2017లో పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారు. ఇక.. 2020 ఎన్నికల్లో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసి ఆ పార్టీ ఘన విజయానికి కారణం అయ్యారు. అలాగే.. 2021లో తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ గెలుపు కోసం కృషి చేశారు. దేశవ్యాప్తంగా కీలక రాష్ట్రాల్లో గెలుపు కోసం పనిచేసిన ఆయన.. 2023లో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఐప్యాక్ వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తానే స్వయంగా ఓ పార్టీని ప్రకటించారు. జన సూరజ్ పేరిట కొత్తగా పార్టీని పెట్టారు. ఈ మేరకు బిహార్ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆయన పాదయాత్ర సైతం చేశారు. ఇప్పుడు అక్కడ పలు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల బిహార్‌లోని బెలాగంజ్‌లో పీకే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఏదైనా పార్టీకి వ్యూహకర్తగా పనిచేస్తే ఎంత తీసుకుంటారనే దానిపై రకరకాల ప్రచారాలు వినిపించాయి. కానీ.. తాను తీసుకునే రెమ్యునరేషన్‌పై పీకే ఒక్కసారిగా నోరుజారారు. తాను ఏ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసినా అందుకు ఫీజు కింద రూ.100 కోట్లు వసూలు చేస్తానని పీకే ఆ ప్రచారంలో భాగంగా చెప్పారు. కొన్ని పార్టీల వద్ద అంతకన్న ఎక్కువే తీసుకుంటానని వ్యాఖ్యలు చేశారు. దేశంలో పది ప్రభుత్వాలు తన వ్యూహాలతోనే అధికారంలో కొనసాగుతున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక పార్టీకి ఎన్నికలకు వ్యూహకర్తగా పనిచేస్తే.. తన పార్టీని రెండేళ్ల పాటు నడిపించవచ్చని అన్నారు. అయితే.. పీకే వ్యాఖ్యలతో ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న.. గతంలో అధికారంలో కొనసాగిన పార్టీలు గందరగోళంలో పడ్డాయి. పీకేకు ఇవ్వడానికి ఆ పార్టీల దగ్గర రూ.100 కోట్లు ఎక్కడివి..? దేని ద్వారా వాటిని సేకరించారు..? పీకేకు చెల్లించిన మొత్తాన్ని ఎన్నికల ఖర్చుల్లో చూపించారా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఒకవేళ చూపించనట్లయితే ముందు ముందు ఎన్నికల కమిషన్ ఆయా పార్టీల పట్ల ఏమైనా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయా..? అన్న సందేహాలూ వినిపిస్తున్నాయి. అటు పార్టీలు సైతం రూ.100 కోట్ల అంశంపై ఎలా స్పందిస్తాయో చూడాలి మరి. మొత్తానికి పీకే వ్యాఖ్యలు ఆయా పార్టీలు తప్పనిసరిగా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితిని తెచ్చాయని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం

పునరుద్ధరిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో సీఆర్డీఏ (CRDA) పరిధిని కుదించి అమరావతి ప్రాంతానికి పరిమితం చేయగా.. దాన్ని పునరుద్ధరించింది. సీఆర్డీఏ పరిధిని 8,352 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ఆమోద ముద్ర వేసింది. సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1069.55 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, పల్నాడు జిల్లా 92 గ్రామాలు, బాపట్ల జిల్లా 62 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి వచ్చేలా కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 11 మండలాల్లోని 154 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి తెచ్చింది. కుప్పం, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ 4 మండలాలను, ఓ మున్సిపాలిటీని కవర్ చేస్తూ స్థాపించబడింది. ఏపీ ఎక్సైజ్ సవరణ ఆర్డినెన్స్ 2024కు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అలాగే, ఏపీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. అలాగే, 2014 15 నుంచి 2018 19 మధ్య పూర్తైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి పనుల బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అటు, 2024, జూన్ 24 నుంచి అక్టోబర్ 23 వరకూ తీసుకున్న మంత్రివర్గ నిర్ణయాలపైనా రూపొందించిన నివేదికలపైనా చర్చ సాగింది. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక సంక్షేమం, విద్యా రంగం తదితర విషయాల్లో సీఎం అమాత్యులకు దిశానిర్దేశం చేశారు.



## తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటింటి సర్వే

సర్వేలో ప్రభుత్వం ఉద్యోగం చేస్తున్న వారి వివరాలు, రాజకీయాల్లో ఉన్నట్టు అయితే వారి వివరాలు, పదవుల్లో ఉంటే ఆ పదవుల వివరాలు కూడా చెప్పాల్సి ఉంటుంది. గతంలో పథకాలు లబ్ధి పొంది ఉంటే వాటి వివరాలు అడుగుతారు. మీ ఫ్యామిలీ మెంబర్స్‌లో ఎవరైనా విదేశాల్లో ఉంటే ఆ వివరాలు కూడా చెప్పాలి. ఒక్కో దేశానికి ఒక్కొక్క కోడ్ ఉంది. దాని ప్రకారం ఏ ప్రాంతం వాళ్లు ఏ దేశంలో ఉంటున్నారు. అందులో గల్ఫ్‌లో ఉంటున్న వారు ఎంత మంది అనే వివరాలు తెలియబోతున్నాయి. సర్వేలో కులమతాలకు సంబంధించిన వివరాలు సేకరించడంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఫామ్‌లలో కులం, మతం వివరాలు వెల్లడించడానికి ఇష్ట పడని వారి కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయమని ఆదేశించింది. రాజ్యాంగంలోని అధికరణ 25(1) ప్రకారం పౌరులకు స్వేచ్ఛ ఉందని అందుకే ఈ విషయాన్ని పరిశీలించాలని పేర్కొంది. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో చెప్పాలని కోర్టు ఆదేశించింది. ఇవాళ్టి నుంచి ప్రారంభమైన సర్వే ఈనెల 30 వరకు కొనసాగనుంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలు సేకరిస్తారు. ప్రతి 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. ఎన్యూమరేటర్లకు 10 వేల రూపాయల పారితోషికం, సూపర్‌వైజర్లకు 12 వేల రూపాయల పారితోషం ఇస్తారు. ఎన్యూమరేటర్లకు మహిళా సంఘాలు, టీచర్లు, ఇతర విభాగాల సిబ్బంది సహాయం చేస్తారు. సర్వే ఫామ్ 3 విభాగాలుగా ఉంటుంది. సర్వే చేస్తున్న ప్రాంతం వివరాలు మొదట ఫిల్ చేయాలి. జిల్లా కోడ్, మండలం కోడ్, ఇంటి నెంబర్ ఎంటర్ చేయాలి. జిల్లా పేరు, మండలం పేరు, పంచాయతీ లేదా మున్సిపాలిటీ పేరు, హాబిటేషన్ పేరు, వార్డ్ నెంబర్, ఇంటి నెంబర్ వీధి పేరు దానికి కేటాయించిన కోడ్ నమోదు ఎంటర్ చేస్తున్నారు అక్కడే కుటుంబానికి ఇచ్చే ఓ సీరియల్ నెంబర్ ఎంటర్ చేస్తున్నారు. తర్వాత పార్ట్ 1లో కుటుంబానికి సంబంధించిన వివరాలు రాస్తున్నారు. కుటుంబ యజమానికి ఉన్న సంబంధం, వారి కేటగిరి ఏంటో చెప్పాలి. మతం, సామాజిక వర్గం, కులం చెప్పాలి. వయసు, మాతృభాష ఎంటర్ చేస్తున్నారు. ఆధార్ కార్డు వివరాలు ఇవ్వడం ఐచ్చికం చేశారు. అంటే ఇష్టం ఉంటే ఇవ్వాలి లేకుంటే ఇవ్వబోమని చెప్పారు. మొబైల్ నెంబర్, పెళ్లి అయిందో లేదో కూడా చెప్పాలి. దివ్యాంగులైతే ఆ వివరాలు అందించాలి. విద్యార్హతలు కూడా చెప్పాలి. తర్వాత పేజ్‌లో ఉపాధి, ఉద్యోగం వివరాలు చెప్పాలి. రియల్ ఎస్టేట్ చేస్తున్నారా ఉద్యోగం చేస్తున్నార లేకుండా వ్యాపారం చేస్తున్నారో వివరించాలి. టర్నోవర్ గురించి చెప్పాలి. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారో లేదో తెలపాలి. తర్వాత భూముల వివరాలు అందజేయాలి. మీరు భూమి కలిగి ఉన్నారా? ధరణి పాస్ బుక్ ఉంటే నెంబర్ రాయండి ? భూమి ఏ రూపంలో ఉందో చెప్పాలి అంటే... పట్టా స్థలమా, అసైన్డ్ స్థలమా, అటవీ హక్కు భూమో చెప్పాలి. భూమి ఏ రకమో వివరించాలి. భూమికి నీటి పారుదర సౌకర్యం ఎలా కల్పిస్తున్నారో తెలియజేయాలి. కౌలు భూమి సాగు చేస్తున్నట్లైతే ఎంత విస్తీర్ణమో చెప్పాలి.

**రిజర్వేషన్ కేటగిరిలోకి వివరాలు సమర్పించాలి:-**
రిజర్వేషన్ విధానం నుంచి పొందిన విద్యా ప్రయోజనాలు ఏంటీ, రిజర్వేషన్ విధానం నుంచి పొందిన ఉద్యోగ ప్రయోజనాలు ఏంటీ, గత ఐదేళ్లుగా మీరు లబ్ధి పొందిన మూడు ప్రభుత్వ పథకాల పేర్లు, రిజర్వేషన్ కేటగిరికి చెందిన వారు అయితే సర్టిఫికేట్ తీసుకున్నారా అవునో కాదో చెప్పాలి. మీరు డీనోటిఫై చేసిన సంచార లేదా పాక్షిక సంచార తెగకు చెందినవారా, వీటితోపాటు రాజకీయ వివరాలు తీసుకుంటున్నారు. ఏ పార్టీలో సభ్యత్వం ఉంది...ఏ పదవుల్లో ఉన్నారు ఎప్పటి నుంచి పని చేస్తున్నారో తెలియజేయాలి. వలస వచ్చిన వాళ్లు అయితే ఎక్కడి నుంచి వలస వచ్చారో కూడా చెప్పాలి.

# గురుకులలపై కాంగ్రెస్ ప్రభుత్వం కాపట ప్రేమ

- 10 నెలల కాలంలో గురుకులలు అధోగతి
- గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :**



గురుకుల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ వాటిని నిర్వీర్యం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు.గురుకులాల్లో జరుగుతున్న వరుస సంఘటనల వల్ల పిల్లల్ని చదివించాలంటేనే భయపడే పరిస్థితులు గురుకులాల్లో నెలకొన్నాయని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ వర్గాల్లో ఉన్న పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని మహోన్నత లక్ష్యంతో ఏర్పాటుచేసిన గురుకుల విద్యాలయాలన్నీటిని సమస్యల కూపంలోకి నెడుతూ వాటిని పర్యవేక్షించే దిక్కు లేక నిర్వీర్యం చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.

కెసిఆర్ హయాంలో గురుకుల విద్యార్థుల్ని ఎవరెస్టు ఎక్కిస్తే ఇవాళ ఎలుకలు కరిచే పరిస్థితికి గురుకులాల్ని దిగజార్చారన్నారు. కెసిఆర్ ఒక్కో విద్యార్థి మీద 1,20,000 ఖర్చు చేస్తూ కార్పొరేట్ స్థాయి విద్యనందించి వాళ్లను ఇంజనీర్లుగా డాక్టర్లుగా లాయర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తే నేడు గురుకుల విద్యార్థులు సరైన ఆహారం అందక ఆసుపత్రి పాలయ్యే దుస్థితికి తీసుకువచ్చారన్నారు. వరుసగా గురుకులాల్లో పాముకాటుతో,కరెంట్ షాక్ లతో, ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తనట్టు వ్యవహరిస్తుందన్నారు. వెంటనే గురుకులాల్లో హెల్త్ సూపర్వైజర్లను నియమించడంతోపాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించి అదేవిధంగా పౌష్టికాహారం కల్తీ లేకుండా పిల్లలకు అందించాలని కోరారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య వైఖరి వల్ల గురుకుల విద్య మీదనే కుట్ర చేస్తుందనే అనుమానం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఒకవైపు ప్రపంచ స్థాయి గురుకులాల్ని చెబుతూనే మరోవైపు ఉన్న గురుకులాల్ని నిర్వీర్యం చేసే చేయడం దుర్మార్గమని, గురుకులాల్లో చదువుతున్నది పేద దళిత బడుగు బలహీన వర్గాల పిల్లలేనని వారి సంక్షేమాన్ని చూసే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. పదేపదే గురుకులాల్లో వరస సంఘటనలు జరుగుతున్న విద్యార్థుల ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి గురుకులాల్లో జరుగుతున్న సంఘటన మీద సమీక్షించి వారికి కావలసిన అన్ని వసతుల్ని కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



## రోడ్లపై వడ్లు పోస్తే కఠిన చర్యలు

- గజ్వేల్ సిఐ, బి సైదా

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :**

బుధవారం గజ్వేల్ సిఐ బి సైదా మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుంది. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కల్వర్టును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**గజ్వేల్, నవంబర్ 06 :**

గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలని పార్కు రోడ్డులో గల కల్వర్టు ఇటీవల పగిలిపోయింది. దీంతో కాలనీవాసులు గతంలో సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం అందజేశారు. అయినా పనులు పూర్తి కాలేదని, మీరు స్వయంగా వచ్చి చూడాలని చైర్మన్ ను కోరడంతో ఆ రోడ్డును కాలనీ అసోసియేషన్ నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి శిదిలమైన రోడ్డు కల్వర్టును వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులతో తెలిపారు. వారితో పాటుగా అసోసియేషన్ నాయకులు గుజ్జేటి రామచంద్రం, వగ్గు మల్లేశం, బండ్ల స్వామి తదితరులు ఉన్నారు.

## లోక కళ్యాణం కోసమే నా యాత్ర

**జయభేరి, పిఠాపురం:**

సమాజంలో మహిళలపై అత్యాచారాలు,గో హత్యలు,గుడులు ధ్వంసం పేట్రేగిపోతూన్నాయని,వాటినన్నింటినీ నిలుపుచేసి లోకకల్యాణం జరిపేందుకే తాను బయటికొచ్చి దేవాలయాల దర్శనం,యజ్ఞ,యాగాదులు జరుపుతూన్నానని నాగసాధువు, మహిళా అఘోరి పేర్కొన్నారు.దేవాలయాల దర్శన పర్యటనలో భాగంగా పిఠాపురం పాదగయాక్షేత్రం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయాన్ని నాగసాధువు,మహిళా అఘోరి సందర్శించారు.. మొన్న తెలంగాణలో, నిన్న ఉత్తరాంధ్రలో పర్యటించిన నాగసాధువు,మహిళా అఘోరి అకస్మాత్తుగా పిఠాపురంలో ప్రత్యక్షమయ్యారు.ఇందులో భాగంగా శ్రీ కుక్కుటేశ్వరస్వామిని,రాజరాజేశ్వరీ అమ్మవారిని,దత్తాత్రేయస్వామిని,పురుహూతికా అమ్మవారిని ఒంటికాలిపై నిలబడి దర్శించి,తపోముద్రలో ధ్యానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి వచ్చిన మహిళా అఘోరీని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

# పాఠశాలలో విద్యా వాలంటీర్లను కొనసాగించాలని విజ్ఞప్తి

- అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తకు వినతి పత్రం సమర్పించిన జగన్ గూడ గ్రామస్తులు
- సానుకూలంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్

**జయభేరి, నవంబర్ 6:**



ముడుచింతలపల్లి మండలం జగన్ గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గతంలో ఉపాధ్యాయుల కొరతతో విద్యా వాలంటరీలను నియమించారు. అయితే ఇటీవల జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి విద్యా వాలటీర్లను వద్దంటు పాఠశాల ప్రదానోపాధ్యాయులుకు ఆదేశాలు జారీ చేశారు. కాగా పాఠశాలలో విద్యా వాలంటీర్లను కొనసాగించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు కలిసి అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తకు వినతి పత్రం సమర్పించారు. పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి తప్పనిసరిగా విద్యా వాలంటీర్లు అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఒకేసారి వారిని వద్దని ఆదేశాలు జారీ చేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వారి పరిస్థితులు, విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని వారిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్ ఈ సమస్యను పరిష్కరించి విద్యా వాలంటీర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, నాగరాజు, సురేష్, మహేష్, చంద్రశేఖర్, రమేష్, దామోదర్, విలేజ్ ఆర్గనైజేషన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# బైకులను దొంగతనం చేసే వ్యక్తి అరెస్టు

**గజ్వేల్, నవంబర్ 06 :**




ఐదు బైకులు దొంగిలించిన నిందితున్ని గజ్వేల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి గజ్వేల్ సిఐలు తెలిపిన వివరాలు ప్రకారం 6వ తేదీన నమ్మదగిన సమాచారంతో గజ్వేల్ లో బైకులు దొంగను వ్యక్తి తూప్రాన్ లో ఉన్నాడని సమాచారం రాగా, అక్కడికి వెళ్లి నిందితుడు దండు ఠాగూర్ (22) చాకచక్యంగా పట్టుకొని గజ్వేల్ పోలీస్ స్టేషన్ తరలించి విచారించగా, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైకును, గౌరారం పీఎస్ పరిధిలో ఒక బైకును, గజ్వేల్ పిఎస్ పరిధిలో మూడు బైకులను దొంగతనం చేసినట్లు అంగీకరించినందున నిందితుని నుండి ఐదు బైకులు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. మోటార్ సైకిల్ దొంగను పట్టుకున్నందుకు సిఐలు సైదా, ముత్యంరాజు, ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ యాదగిరి, కానిస్టేబుళ్లు నవీన్, రవి, నరేందర్, వెంక టేష్, స్వామిలను ఏసిపి పురుషోత్తం రెడ్డి అభినందించినారు.

# అణగారిన వర్గాలకు ఉపదేగపడే కుల గణన సర్వే

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**జయభేరి, పరకాల, నవంబర్ 6:**



తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక,విద్యా,ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి కుటుంబ కులగణన సర్వేతో పాటు, రాష్ట్రంలో చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని పోవాలని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గీసుగొండ మండలంలోని ఎస్ ఎస్ గార్డెన్ లో బుధవారం జరిగిన గీసుగొండ, సంగెం మండలాలు, నియోజకవర్గంలోని 15,16,17 డివిజన్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగినది. ఈ సమావేశంలో పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు ఉపయోగపడే విధంగానే సమగ్ర కుల గణన కార్యక్రమం ఉంటుంది అని ,కుల గణన జరిగితే కులంలో ఎందరు ఉన్నారో ఎవరికి ఏవిందంగా న్యాయం చేయగలమో అనే ఉద్దేశం తో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటూ వస్తుందని అందులో భాగంగా ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు కుల గణన సర్వేను చేపట్టిందన్నారు. కుల గణన పై గతంలో చాలామంది మాట్లాడారే తప్ప ఆచరణలోకి తీసుకురాలేక పోయారన్నారు.
కులగణన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.
కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి 7 లక్షల కోట్లకు పైగా అప్పులు,49 వేల కోట్ల బకాయిలు భారం మోపిందన్నారు.
కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, రానున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలు బరితెగించి అబద్ధాలు ప్రచారం చేస్తూ తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడుతున్నారని వాటిని కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని అన్నారు. మనం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిపక్షాలు చేసిన తప్పుడు పనులను ఎత్తిచూపుతూ వాస్తాలను ప్రజలకు వివరించాలని కొరారు. రైతులు పండించిన సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటి వరకు మొత్తం నియోజకవర్గంలో 101 కోట్ల 79 లక్షల 20 వేల 432 రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుండి కొన్ని మంజూరై కొన్ని ప్రతిపాదనలో ఉన్నాయి. మరో 100 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు మంజూరి తీసుకొని రావడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశములు కల్పించుటకు వారికి స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఇప్పించి జాబ్ మేళాను అతి త్వరలో చేపట్టబోవుచున్నాము. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కుకు ముఖ్యమంత్రి గౌరవ శ్రీ రేవంత్ రెడ్డిని ఆహ్వానించి భూములు కోల్పోయిన రైతులకు 100 గజాల స్థలం ఇవ్వాలని కోరడం జరిగినది. త్వరలోనే వారికి ఇంటి స్థలాలు ఇవ్వబోతున్నాము. ఇందిరమ్మ ఇల్లు కూడా త్వరలోనే ఇప్పిస్తామన్నారు.



## నియోజకర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబా నగర్ లో 22 లక్షల నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సతీష్, AE,BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హై టెన్షన్ వైర్లు వద్దు సార్

- గ్రామంలో నుండి వద్దంటున్న గణేష్ పల్లి గ్రామస్థులు.



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం గణేష్ పల్లి గ్రామంలో హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేస్తున్నారు. బుదవారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాములు,యువ నాయకుడు రామరాజు మాట్లాడుతూ గణేష్ పల్లి గ్రామం మధ్యలో నుండి భారీ హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేస్తే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని ఇప్పటికే గ్రామంలో విద్యుత్ స్తంభాలతో వాహనాలకు ఇబ్బందిగా మారిందని, పాత స్తంభాలు కాకుండా మళ్ళీ కొత్తగా భారీ హై టెన్షన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి గుంతలు తీస్తున్నారని దయచేసి విద్యుత్ అధికారులు గ్రామం మధ్య నుండి కాకుండా గ్రామం బయట నుండి ఈ హై టెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణం ఏర్పాటు చేయాలని, విద్యుత్ టవర్ల నిర్మాణం వల్ల భవిష్యత్తు తరాలకు ప్రమాద భరితంగా మారుతుందని దయచేసి గ్రామం వెలుపల నుండి విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు విన్నపం చేశారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి




**జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :**

క్రీడలతో మానసిక ఉల్లాసం పొందచ్చని విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో చెస్ క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించారు.ఇందులో దాదాపు 200 మంది క్రీడాకారులు వివిధ ప్రాంతాల నుండి పాల్గొనగా వారికి చెస్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొంతమంది విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేశారు.వారిని తూముకుంటలో శుక్రవారం జరిగే రాష్ట్రస్థాయిలో చెస్ పోటీలకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, చదరంగం పోటీల్లో పాల్గొని గజ్వేల్ సత్తా చాటాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎస్.జిఎఫ్ సెక్రెటరీ ఎలియాస్ రావు మాట్లాడుతూ, చదరంగం క్రీడ విద్యార్థిని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్రస్థాయిలో నిర్వహించే చెస్ పోటీలకు గజ్వేల్ ప్రాంతం నుండి సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దిన్, కిషన్ రెడ్డి, చందు, పీఈటీలు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక కార్యకర్త సేవాలు భేష్

- మర్కుక్ ఎమ్మార్వో ఆరిఫా



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామ యువ నాయకుడు సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ సేవలు అభినందనీయమని మర్కుక్ మండల ఎమ్మార్వో ఆరిఫా తెలిపారు.పాములపర్తి గ్రామంలో సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ ఇటీవల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మర్కుక్ మండల ఎమ్మార్వో తాండ బాలకృష్ణ గౌడ్ ఆహ్వానం మేరకు బుధవారం తాండ బాలకృష్ణ గౌడ్ స్వగృహానికి వచ్చిన ఎమ్మార్వో ఆరిఫా మాట్లాడుతూ సమాజ సేవలో తన వంతు పాత్ర పోషిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న తండా బాలకృష్ణ గౌడ్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్, తాజా మాజీ జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, తాజా మాజీ వైస్ ఎంపీపీ మంద బాలరెడ్డి, నాచారం దేవస్థానం మాజీ చైర్మన్ హరిపంతులు, తదితరులు పాల్గొన్నారు.



## కులగణన కుటుంబ సర్వేను ప్రారంభించిన

■ మున్సిపల్ చైర్మన్ సోద అనితా రామకృష్ణ

✍ జయభేరి, పరకాల, నవంబర్ 06:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం పరకాల శాసనసభ్యులు గౌరవ రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపల్ లోని 10వ వార్డు మాదారంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభోత్సవం చేసిన పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ , వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కోడూరి సుష్మ గారు, స్థానిక కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్, కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, దామెర మొగిలి, ఏకు రాజు, మున్సిపల్ ఏఈ రంజిత్, మున్సిపల్ ఆర్వో రఘు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడ్డ ఇద్దరికీ మూడేళ్ల శిక్ష

✍ జయభేరి, గజ్వేల్, నవంబర్ 06 :

దొంగతనాల కేసులో ఇద్దరు నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష పడినట్లు గజ్వేల్ ప్రథమ శ్రేణి అదనపు న్యాయమూర్తి శ్రీమతి ప్రియాంక తెలిపారు. నింధితులు జాదవ్ జైరామ్ తండ్రి బిక్కునాయక్ (38), రాథోడ్ జాదవ్ నగేష్ తండ్రి వాలునాయక్ (34) వీరి నివాసం సంగారెడ్డి జిల్లా, సిర్గాపూర్ మండలం, వాసర గ్రామం, బీబ్యానాయక్ తండా కాగా, సుమారు ఆరు నెలల క్రితం గోవిందాపూర్, వేలూర్ లలో వరుస దొంగతనాలు చేశారు. నూతన టెక్నాలజీ ఉపయోగించి 8 కేసులలో నిందితుల నుండి బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. నింధితులపై ఏడు కేసులలో నేరం రుజువైనందున బుధవారం గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శ్రీమతి ప్రియాంక నేరస్తులకు మూడు సంవత్సరంల జైలు శిక్ష విధించారు. ఈ కేసులలో ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించి త్వరగా నిదితులకు శిక్ష పడేలా చేసిన పిపి విజయసుద, ఈ కేసులలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ ఐన తొగుట సిఐ లతీఫ్, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి, అప్పటి గౌరారం ఎస్ఐ శివకుమార్, ప్రస్తుత గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణను పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అభినందించి త్వరలో రివార్డు అందజేయనున్నట్లు ప్రకటించారు.

## అతిధి షార్ట్ ఫిల్మ్ పోస్టర్ రిలేజ్ చేసిన కన్నూరు




✍ జయభేరి, పరవాడ:

డెన్ స్టూడియో ఆధ్వర్యంలో రూపొందించిన షార్ట్ ఫిల్మ్ పోస్టర్ తానాం గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ చేతుల మీదుగా అతిధి పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్బంగా కన్నూరు మాట్లాడుతూ అతిధి షార్ట్ ఫిల్మ్ అందరిని ఆకొట్టుకొని మంచిగా ఆడాలని కోరుకొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రొంగలి అప్పారావు ,ఉప సర్పంచ్ వ్రరీ మంగ లక్ష్మి వసంతరావు,హీరో. ఉత్తేజ్, డైరెక్టర్. నరేష్, నిర్మాత. కోడి నాని, కట్టా అనిల్,కట్టా సన్యాసిరావు, ఈతలపాక కన్నా మరియు వార్డు మెంబెర్స్, కెవి.యువసేన సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలని వాసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. బుధవారం ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో కలిసి డబుల్ బెడ్ రూం ఇండ్లను సందర్శించారు. అనంతరం వారి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,మాజి ఎంపీపీ జాని యాదవ్, పి ఎస్ సి ఎస్ చైర్మన్ జాల నర్సింహా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్, కౌన్సిలర్ జయ ప్రకాష్,యువజన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మాజి సర్పంచ్ ముచ్చర్ల గిరి,పీడీ రాజు కుమార్,ఈ ఈ హుస్సేన్,డి ఈ విద్యాసాగర్,ఏ డి సైదులు, ఆర్డబ్ల్యూఎస్ డిఈ నాగేష్,మున్సిపల్ ఏఈ రాజు,పి ఆర్ ఏ ఈ శంకర్. ఏఈ.వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో అర్చకుల కనీస వేతనం 15 వేలు

✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6

ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాల్లో పనిచేసే అర్చకుల కనీస వేతనాలు పెంచుతున్నట్టు దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి తెలిపారు. ఏపీలో అర్చకుల కనీస వేతనం 15 వేలకు పెరుగుతుంది.దీంతో 3,208 మంది అర్చకులకు లబ్ధిచేకూరనున్నది.

# అంగరంగ వైభవంగా ప్రారంభమైన శివాలయ పునః ప్రతిష్ట

■ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి ఆధ్వర్యంలో మహాన్నదానం కార్యక్రమం

■ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులు అన్నదానం నిర్వహించబడును.

✍ జయభేరి, పరకాల, నవంబర్ 06:





పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రం లోని శ్రీ మహాదేవ పంచకూట శివాలయ పునః ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం వేద పండితుల మంత్రోశ్చరణలు, భాజా భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మంగళ వాయిద్య సంఘోషణ, గణపతి పూజ, భూత బలి, యాగ శాల ప్రవేశం, విఘ్నేశ్వర పుణ్యహా వచనం, పంచగవ్య ఆరాధన, యంత్ర విగ్రహ మార్జనం, అఖండ దీపారాధన, నీరజన మంత్ర పుష్పములు, తీర్ధ ప్రసాదాల వితరణ కార్యక్రమాలను ఉదయం నిర్వర్తించగా, సాయంత్రం మృతంగ్రహణ, అంకురారోపన, మహా మంటప ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, మూల హవనములు, నవ కళాశర్చన, ద్వాదశ ఆలాపన, జలాదివస సహిత్ క్షీరాభిషేకం, నీరాజన మంత్ర పుష్పములు, రాజోప చరములు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వచ్చునూరు శ్రావణ్ శర్మ, శరత్ శర్మ, రవీందర్ శర్మల ఆధ్వర్యంలో వేద పండితులు శానగొండ శివకిరణ్ ల ఆధ్వర్యంలో పండితులు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రం రెడ్డి మహా అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, దాతలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పింగిలి శ్రీపాల్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

■ పుల్లం దామోదర్ రెడ్డి పిఅర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

■ పిఅర్టీయూ తరుపున ఎమ్మెల్సీ బరిలో శ్రీపాల్ రెడ్డి

■ గెలిపిస్తే మంచి పిఆర్సిని ఇప్పిస్తాం

✍ జయభేరి, పరకాల, నవంబర్ 06:



పింగిలి శ్రీపాల్ రెడ్డిని గెలిపించండి మంచి పిఆర్సిని ఇప్పించటమే కాకుండా, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించుటకు పీఆర్టీయూ సంఘం కృషి చేయడం జరుగుతోందని పీఆర్టీయూ టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్ రెడ్డి అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి గెలుపు కొరుతూ నడికూడ మండలంలోని కంటాత్మకూర్, కౌకొండ, నడికూడ, రాయపర్తి, వరికోల్, నార్లాపూర్, చర్లపల్లి ఉన్నత పాఠశాలలలో ప్రచారం నిర్వహించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం పని చేస్తు పీఆర్టీయు తరుపున పోటీలో ఉన్న శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడే సంఘం, అనేక జీవో లు సాధించిన సంఘం పి అర్ టీ యు అని అలాంటి సంఘం తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న పింగిలి శ్రీపాల్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.
నడికూడ మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ మన ప్రాంతావాసి, వరంగల్ ముద్దుబిడ్డ, ఉపాధ్యాయుల పక్షపాతి పింగిలి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్ రెడ్డి, హనుమకొండ జిల్లా, ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అచ్చ సుదర్శన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గొట్టెముక్కుల శ్రీనివాస్ రెడ్డి, మోడెం రాజేందర్ బాబు, నన్నేసాహెబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరుగు శంకర్, జిల్లా కార్యదర్శి శరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విజయసాయి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్

✍ జయభేరి, పరవాడ:

విశాఖపట్నం విచ్చేసిన రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర వైఎస్ఆర్సీపీ ఇంచార్జి విజయ సాయి రెడ్డిని విశాఖపట్నం సీతమ్మదార కార్యాలయం లో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలో పలు అంశాలు,పెందుర్తి నియోజకవర్గం లో పార్టీ బలోపెతం కోసం సుధీర్ఘంగా చర్చించారు.

## ప్రభుత్వ సబ్సిడీలకి బ్యాంక్ అకౌంట్కి ఆధార్ తప్పనిసరి

✍ జయభేరి, పరవాడ:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రములో 18 సం. పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు ఎన్పిసిఐ లింక్ బ్యాంక్ అకౌంటు ఉండాలని కొత్తగా సర్క్యులర్ ఇచ్చింది. దీని పై జిల్లా కలెక్టర్ గ్రామాలలో ప్రజలని చైతన్యపరచి ఎన్పిసిఐ లింక్ అయ్యే విధంగా అధికారులు కృషి చెయ్యాలని అన్నారు. ఇటీవలే విజయవాడలో వచ్చిన వరదల్లో నష్టపోయిన వారికి నష్టపరిహారం అందకపోవడం కేవలం ఎన్పిసిఐ లింక్ అయ్యిన బ్యాంక్ అకౌంటు లేకపోవడమనని కాబ్బట్టి ప్రజలు అందరకి ఎన్పిసిఐ లింక్ బ్యాంక్ అకౌంటు ఉండాలని సూచించారు. అలాగే చాలా మంది ప్రజలకు బ్యాంక్ అకౌంటు ఉంటుంది కానీ ఎన్పిసిఐ లింక్ అవ్వనివారు దగ్గర్లో వున్న పోస్ట్ ఆఫీస్ లేదా పోస్ట్ మ్యాన్ ను సంప్రదించి ఐపిపిబి అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని అన్నారు. పోస్టు ఆఫీసులో ఎన్పిసిఐ లింక్ అనేది వేగంగా, ఖచ్చితంగా అవుతుందిని గవర్నమెంట్ సబ్సిడీ అమౌంట్ పోస్ట్ ఆఫీస్ అకౌంటులో ఆటోమేటిక్ గా పడుతుందని అన్నారు. ఎన్పిసిఐ లింక్ అవ్వని వారు గ్రామంలో సచివాలయంలో సిబ్బంది కలవాలని అన్నారు.

# రైతులకు సేంద్రియ ఎరువులను అందజేసిన రామ్ కీ ఫౌండేషన్

✍ జయభేరి, పరవాడ:



పరవాడ మండలం, నాయుడుపాలెం గ్రామంలో 97 మంది రైతులతో 100 ఎకరాలలో రామ్ కీ ఫౌండేషన్ ప్రయోగాత్మకంగా చేపడుతున్న సేంద్రీయ వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా సుమారు రెండు లక్షల రూపాయల విలువైన సేంద్రియ ఎరువులను అందజేయడం జరిగినది. పారిశ్రామికీకరణ కారణంగా రోజురోజుకు పర్యావరణంలో పెను మార్పులు సంభవించి మనం తినే ఆహార పదార్థాలు కూడా తీవ్రంగా కలుషితం అయి మానవ ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రస్తుతం రామ్ కి ఫౌండేషన్ వారు అందజేస్తున్న ఫసల్ అమృత్ ఎరువు ద్వారా 40 % తక్కువ నీటితో 30% తక్కువ ఎరువుతో 30% అధిక దిగుబడి పొంది రైతు ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీతారామయ్య మాట్లాడుతూ... రామ్ కీ ఫౌండేషన్ 97 మంది సన్నా, చిన్నా కారు రైతులకు సేంద్రియ ఎరువుల అందజేయడం సంతోషంగా ఉందని , ఇటువంటి కార్యక్రమాలు మా గ్రామంలో చేసినందుకు రాంకీ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రి సస్టైనబులిటీ హెచ్ ఆర్ బాలాజీ , రామ్ కి ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కోఆర్డినేటర్ రాజేశ్వరి, సర్పంచ్ వరలక్ష్మి, గ్రామ పెద్దలు సీతారామయ్య, శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ ఆర్ ముత్యాలు, వార్డు మెంబర్ మహాలక్ష్మి, రమాదేవి, గంగరాజు, సన్ని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రాంతీయ పత్రికలకు గుడ్ న్యూస్

■ జీఎస్టి, ఐటీ రిటర్న్స్ సంబంధం లేకుండా అక్రిడిడేషన్లు.. ఎంప్యానల్‌మెంట్ పత్రికలే కాదు.. రెగ్యులర్ పత్రికలను గుర్తిస్తాం... వాటికి యాడ్స్ ఇస్తాం.. అన్ని పత్రాలు పరిశీలన తరువాతే ప్రకటనలు.. కూటమి ప్రభుత్వంలో చిన్న పత్రికలకు న్యాయం చేస్తాం..

✍ జయభేరి, అమరావతి :




గత ప్రభుత్వంలో జీఎస్టీ ఐటీ రిటర్స్ అంటూ ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతీయ పత్రికల ఎడిటర్లకు సమాచార శాఖా మంత్రి శుభవార్త చెప్పారు. క్యాబినేట్ సమావేశం అనంతరం సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మంత్రి పార్ధ సారధి ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం (ఏపీఎస్ఎస్) నేతలు ఆయన్ని కలిశారు. చిన్నపత్రికలకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి పార్థ సారధి సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో అనేక కష్టాలు పడ్డామని కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాంతీయ పత్రికలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పంధించిన మంత్రి పార్థ సారధి ఇక నుంచి జీఎస్టీ, ఐటీ రిటర్న్స్ తో సంబంధం లేకుండానే అక్రిడిడేషన్లు, యాడ్స్ మంజూరు చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏ జిల్లాలో అయితే పర్యటిస్తారో ఆ జిల్లాలో ఎంప్యానల్‌మెంట్ పత్రికలతో పాటు రెగ్యులర్ గా వచ్చే పత్రికలకు కూడా యాడ్స్ ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎంప్యానల్‌మెంట్ ఉన్న పత్రికలకు వారి రేటు కార్డు ప్రకారం ఇస్తామని అలాగే రెగ్యులర్ గా వచ్చే వాటిని గుర్తించి ఇంత అని రేటు కేటాయించిన తర్వాత యాడ్స్ మంజూరు చేస్తామన్నారు.. గుర్తింపు పొందిన ఛార్టర్డ్ అకౌంట్ తో సీఏ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ప్రాంతీయ పత్రికలందరికీ కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామన్నారు. అందరి సమస్యలు వింటామని, అవసరమైతే అన్ని యూనియన్ల తో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రాంతీయ పత్రికలను ఇబ్బంది పెట్టొద్దని రెగ్యులర్ గా వచ్చే వాటిని గుర్తించి యాడ్స్ ఇవ్వాలని తెలిపారు.ఎంతో కాలం నుంచి ప్రాంతీయ పత్రికల ఎడిటర్లు ఎదుర్కొంటున్న సమస్యకు మంత్రి పార్థసారథి పరిష్కారం చూపించారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పత్రిక సంపాదన సంఘం ఆధ్వర్యంలో మంత్రి పార్థ సారధికి ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఎపీఎంపిఎ రాష్ట అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్. ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం రాష్ట అధ్యక్షులు (ఏపీఎస్ఎస్) కుర్మా ప్రసాద్ బాబు, ఏపీజేయూ ప్రధాన కార్యదర్శి కాకుమాను వెంకట వేణు, పోతుల వెంకట్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



# ఆధ్యాత్మికం అయ్యప్ప మాలధారణ

## ప్రారంభమైన అయ్యప్ప మండల దీక్షలు.. ప్రత్యేక పూజలతో సందడిగా మారనున్న మణికంఠుని కోవెళ్లు.. పడి పూజలతో మార్మోగనున్న అయ్యప్ప స్వామి నామస్మరణ..

**జయభేరి, మేడ్చల్ :**

కోరిన కోర్కెలు తీర్చే స్వామి మణికంఠుడు. అయ్యప్పని భక్తితో తలిస్తే సమస్యల గండాలను దాటిస్తాడని భక్తుల నమ్మకం. 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ, దాని వల్ల మానసిక ఆనందం, ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం లభిస్తుందని గురుస్వాములు చెబుతారు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో అయ్యప్ప మాలధారుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. దీంతో అక్కన్నమాదన్నలు నిర్మించిన పురాతనమైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో కార్తీక మాసంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటున్నది. పూర్వకాలంలో మహిషి అనే రాక్షసి బోళా శంకరుడి వరం పొంది ప్రజలను ఇంద్రాది దేవతలను సైతం హింసించేది. తనకు ఆడ,మగ కలయికతో పుట్టిన వారితో గానీ, విల్లుతో గానీ, ఆయుధాలతో గానీ మరణం ఉండకుండా వరం పొందింది. ఆ తర్వాత ఇంద్రాది లోకాలకు వెళ్లి వికృత చేష్టలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. మహిషి చేష్టలకు భయాందోళన చెందిన దేవతలు మహా విష్ణువును శరణు కోరతారు. దీంతో ఆయన మోహినీ అవతారమెత్తి పరమ శివుడిని మోహిస్తాడు. వీరద్దరి కలయికతో అయ్యప్ప జన్మిస్తాడు. మణిమాలతో కేరళ రాజ్యంలోని అటవీ ప్రాంతంలో పాండ్యరాజులకు దొరుకుతాడు. మణిమాలతో దొరికిన ఆ శిశువుకు మణికంఠుడు అని నామకరణం చేస్తారు. మణికంఠుడు మహిషిని వధించి దేవతలు, మునుల పూజలందుకుంటాడు. అనేక మహిమలతో పాండ్య రాజులకు,ప్రజలకు దగ్గరవుతాడు.

### దీక్షలో ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

41 రోజుల అయ్యప్ప దీక్ష ద్వారా మనిషి ఆరోగ్యం చాలావరకు మెరుగుపడుతుంది. భక్తిభావంతోపాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది నియమ నిష్టలతో దీక్షను చేపడతారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థ ఉత్తేజపర్చడం, నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోవడం, కండరాల పటిష్టత, రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనస్సు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగతాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయ్యప్ప దీక్ష ఆరోగ్యానికి ఆరోగ్య రక్షగా ఉంటుంది. అయ్యప్ప మాల ధరించిన దీక్షాపరుల్లో జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తన విధిని గుర్తిస్తారు. సంఘంలో ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలి. మర్యాదపూర్వకంగా మెలగాలనేది దీక్షా నియమం నేర్పుతుంది. సమైక్యత, స్నేహభావం పెంపొందిస్తుంది. నడవడిక మెరుగుపడడమే కాకుండా ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి దీక్ష తీసుకున్న తర్వాత ఆరోగ్యానికి రక్ష అవుతుంది.

### నియమాలు పాటించాలి..

**నర్సింగరావు గురుస్వామి**



స్వామి మాలధారణ దీక్ష తీసుకొన్న వారు ఖచ్చితంగా నియమాలు పాటించాలి. తెల్లారకముందే నిద్ర లేచి చన్నీటి స్నానం చేసి శరణు ఘోష చేసి స్వామికి నైవేద్యం పెట్టాలి. జుట్టు కత్తిరింపు, ధూమపానం, మందు తాగటం, మాంసాహారం భుజించడం చేయకూడదు. ఇతరులను పిలిచేటప్పుడు స్వామి అనే సంభోధించాలి. అయ్యప్పదీక్ష తీసుకున్న భక్తులు నల్లని దుస్తులు ధరించాలి. 41రోజుల పాటు (మండలం రోజు) నియమ నిష్టలు పాటించాలి. దీక్షా సమయంలో తల, గడ్డం, వెంట్రుకలు, గోళ్లను తీయడం నిషేధం. చెప్పులు ధరించొద్దు. తెల్లవారుజామున అమృత ఘడియల్లో (సూర్యోదయానికి ముందు) చల్లని నీటితో స్నానం ఆచరించాలి. సాయంత్రం కూడా చల్లని నీటితో స్నానం ఆచరించాలి. నుదుట విబూది, గంధం,కుంకుమ మధ్యలో బొట్టు పెట్టుకోవాలి ఒక్కపూట భోజనం (మధ్యాహ్నం భిక్ష) రాత్రి పండ్లు, ఫలహారం అల్పాహారంగా తీసుకోవాలి. కటిక నేలపై నిద్రించాలి. అశుభ కార్యాలు జరిగే ప్రదేశాలకు, దుఃఖ: సంబంధమైన ఘటనల్లో పరామర్శకు వెళ్లరాదు. పగలు నిద్రించకూడదు. శవాన్ని చూడకూడదు. మనస్సును అదుపులో ఉంచుకొని శరణు ఘోష చెప్పుకోవాలి. పూజ చేసుకున్న తర్వాత ఉదయం, సాయంత్రం వృత్తి రీత్యా పనులు చేసుకోవచ్చు. తన శక్తికొలది ఒక్కసారైనా ఐదుగురు అయ్యప్పలకు భిక్ష పెట్టాలి. హింసాత్మక చర్యలు, దుర్భాషలాడడం, అబద్ధాలాడడం చేయరాదు. దీక్షా సమయంలో హోదా, వయస్సు, పేద, ధనిక తేడా లేకుండా అయ్యప్పలందరికీ పాదాభివందనం చేయాలి.

### దీక్ష కఠినమైనది..

**అశోక్ గురుస్వామి**



అయ్యప్పదీక్ష ఎంతో కఠినమైంది. ప్రస్తుత కాలంలో మనిషి సక్రమమార్గంలో పయనించాలంటే అయ్యప్పమాల ధారణ చాలా అవసరం. మండల రోజుల దీక్ష మనిషిని చెడు నడక,ఆలోచనలు, ప్రవర్తనల నుంచి దూరం చేసి సత్ప్రవర్తనకు దగ్గరజేస్తుంది. ఏండ్లుగా అయ్యప్పమాల వేసి శబరిమల వెళ్తున్నాను. ప్రతీ సంవత్సరం మాలధారణ చేసే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. అయ్యప్ప మాలను కొత్తగా ఈ సంవత్సరమే ధరించినవారు ఉంటారు. ఏండ్ల తరబడిగా దీక్ష స్వీకరిస్తున్నవారూ ఉంటారు. అయితే ఎవరిని ఎలా పిలుస్తారో చాలా మందికి తెలియదు. మొదటి సారి మాలధరిస్తే 'కన్నెస్వామి' అంటారు. రెండోసారి ధరించిన భక్తులను కత్తి స్వామి గా పిలుస్తారు. మూడోసారి అయితే గంట స్వామి, నాలుగోసారి గధ స్వామి, ఐదోసారి పేరు స్వామి, ఆరోసారి ధరించినవారిని త్రిశూల్ స్వామి అని వ్యవహరిస్తారు. ఏడు, అంతకన్నా ఎక్కువసార్లు ధరిస్తే 'గురు స్వామి'గా పరిగణిస్తారు. 18, అంతకన్నా ఎక్కువ సార్లు మాల ధరించినవారిని 'నారికేళ స్వామి' అని సంబోధిస్తారు. అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన ప్రతిసారి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి వారిగా మారాలని కోరుకుంటూ ఈ పూజను నిర్వహిస్తారని అశోక్ గురుస్వామి చెబుతారు.

### దీక్షలో ప్రశాంతత..

**సాయిపేట మల్లేష్ (కన్నెస్వామి)**



అయ్యప్ప దీక్ష తీసుకున్న తర్వాత దీక్షా నియమాలు కఠినంగా ఉంటాయి. నిత్యం అయ్యప్ప నామస్మరణ చేస్తుండడంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. భక్తిభావం ఏర్పడుతుంది. తొలిసారి అయ్యప్ప మాల ధరించాను. కన్నెస్వామిగా ఉన్న నాలో గురుస్వాములు అయ్యప్పను చూస్తారు. 41 రోజుల దీక్షతో ఆరోగ్యంలో, ఆహార అలవాట్లతో మార్పులు చోటుచేసుకున్నాయి. అయ్యప్ప దీక్ష నియమాలతోపాటు ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుంది. అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రమైనది. మాల ధరించడం వల్ల మనిషిలో మానవతా విలువలు పెంపొందుతాయి. మాలధారణతో మంచి నడవడిక, ఆరోగ్యం, జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా క్రమశిక్షణ అలవడుతుంది. అయ్యప్ప దీక్షాధారణ నియమాలు మనిషి ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి.

---

## ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం

- ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాలు


**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 6:**

తెలంగాణలో ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అమలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు అమలు చేయబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో ఎత్తు. ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అందుకే నిబంధనల్లో కాస్త సడలింపులు ఇస్తోంది. రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమవుతున్న మంత్రి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మాట్లాడిన గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గుడ్ న్యూస్ చెప్పారు. రేషన్ కార్డు లేకపోయిన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే మొదటి విడతకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపారు మంత్రి. ప్రస్తుతం జరుగుతున్న కుటుంబ సర్వే పూర్తి అయిన తర్వాత అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి అందరికీ రేషన్ కార్డులు లేనందున ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దీన్ని చేర్చడం లేదన్నారు. తర్వాత విడుత నుంచి మాత్రం రేషన్ కార్డు కంపల్సరీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఎప్పుడే ప్రారంభించిన ప్రభుత్వం తొలి విడతలో ఇంటి స్థలం ఉండి గృహాలు లేని వారిపై ఫోకస్ పెట్టింది. రెండో విడతలో స్థలం కూడా లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తారు. నవంబర్ ఆరు నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుంది. దీని కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఒకసారి సమాచారం సేకరించిన తర్వాత దాని ఆధారంగా గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులను నిర్ణయిస్తారు. నవంబర్ 15వ తేదీ నుంచి 20 మధ్య ఈ గ్రామసభలు జరగనున్నాయి. గ్రామస్థలు సమక్షంలో అర్హులు ఖరారైన తర్వాత వారికి స్థలం కేటాయిస్తారు. కేంద్రం చెప్పిన నిబంధనల ప్రకారం 80 గంజాల వరకు స్థలం ఇస్తారు. ఆయా గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉంటే సరేసరి లేకుంటే కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పర్యవేక్షణకు అధికారులను ప్రభుత్వం నియమించనుంది. ఈ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక, రాయితీపై మిగతా నిర్మాణ సామగ్రి సప్లై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నియోజకవర్గానికి తొలి దశలో 3,500 ఇళ్లు కేటాయించి అవి నిర్మాణాల పూర్తి అయిన తర్వాత రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇలా ఐదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## కార్తీక్ మాస అన్న సమారాధన కార్యక్రమాలను విజయవంతం చేయండి

- గ్రామ పెద్ద బొమ్మి రెడ్డి పల్లి శ్రీనివాసరావు పిలుపు

**జయభేరి, పరవాడ :**



కార్తీక మాసంలో మునగపాక వెంకటాపురం నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో జరిగే ప్రతిరోజు అన్న సమారాధనను జయప్రదం చేయాలని వెంకటాపురం గ్రామ పెద్దలు బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో నెలరోజుల పాటు జరిగే ఈ భారీ అన్న సమారాధనలో దాతల సహకారంతో ఇటువంటి చక్కటి కార్యక్రమానికి బ్రహ్మరథం పట్టామని పేర్కొన్నారు.. బుధవారం గ్రామ పెద్దలు బొమ్మరెడ్డిపల్లి శ్రీనివాసరావు దంపతులు ఆయన మనవడు అయినా అభిషేక్ భార్గవ్ ( శ్రీనివాస్ కైలాస్ ) పుట్టినరోజు సందర్భంగా ఆయన సహకారంతో ఈ అన్నసమారాధనను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయం గురించి ఆయన మాట్లాడుతూ శ్రీ శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయం వెంకటాపురం ఈ ఆలయం ఎన్నో వందల సంవత్సరాల క్రితం పూర్వీకులు కోనేరు తవ్వుతుండగా ఈ మహా శివలింగం త్రవ్వకాలలో బయటపడింది అప్పటి గ్రామ పెద్దలు నీలకంఠేశ్వరుని ఈ ప్రదేశంలో ఉంచి పూజలు చేయ ఆరంభించినారుఅని పేర్కొన్నారు.. కాలక్రమమైన శివుడుకి పునాదులు తీసి నాలుగు గోడలు నిర్మించి పైన స్లాబు బదులు కమ్మలపాకుతో పూజలు అందుకునే వాడు తదుపరి నేటి కాలపు పెద్దలు పరమశివునికి ఆలయం నిర్మించదలచే ప్రస్తుత ఉన్న ఆలయము 2022లో పునర్ నిర్మించడం జరిగినదిఅని అన్నారు.. పునర్ నిర్మించిన అనంతరం మొదటగా వచ్చిన కార్తీక మాసంలో నెల 30 రోజులు కూడా నిత్య అన్నదానము ప్రారంభం జరిగినదిఅని 2023లో కార్తీకమాస అన్నదానము ప్రారంభించబడి ప్రస్తుతము ద్వితీయ సంవత్సరము కార్తీక్ మాస నిత్య అన్నదానము రెండు నవంబర్ 2024 తేదీ నుంచి అత్యంత వైభవంగా కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది అని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమం డిసెంబర్ 1 వ తేదీ 2024 వరకు దిగ్విజయంగా కొనసాగును అని అన్నారు. ఈ సంవత్సరం కార్తీక మాసం సందర్భంగా అన్న సమారాధనకు సహకరించిన దాతలు అందరికీ గ్రామ పెద్దలు బొమ్మరెడ్డిపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ పరిచారు..





## బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం

- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి
- ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం
- పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి

**జయభేరి, పీఏ పల్లి :**

బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం పిఏపల్లి మండలం అంగడిపేట గేట్ వద్ద బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమెల్యే రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా అని అన్నారు.స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి అని పిలుపునిచ్చారు.ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయింది అని తెలిపారు.పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చింది అని ఆయన అన్నారు బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు.కేసీఆర్ గారు బతుకమ్మ పండుగ వేల చీరెలు ఇచ్చిండు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయి అని అన్నారు. నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు.మహిళలకు 2500 అన్నడు. ప్రతి మహిళకు 25వేల బాకీ పడ్డడు అని తెలిపారు.బతుకమ్మ చీరెలు అన్నడు, 500 ఇస్తడు అన్నడు ఎగ్గొట్టిండు అని అన్నారు వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండు ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిండు అని గుర్తు చేశారు.పింఛన్లు దగా రైతులకు బోనస్ దగా,రుణమాఫీ దగా,తులం బంగారం దగా,విద్యార్థులకు జాబ్స్ దగా,మహిళలకు 2500 దగా, అన్నీ దగా ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మ్యాన్ అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండు అని ఆయన తెలిపారు.ఓట్ల ముందు డిసెంబర్ 9 తారీఖు రుణమాఫీ అన్నడు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15నాటికి పూర్తి చేస్తా అన్నడు అని గుర్తు చేశారు.దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన అన్నారు.రుణమాఫీ డిసెంబర్ 9, 2024 వరకు చేస్తానని ఇప్పుడు అంటున్నారు, అది కూడా 3లక్షల మందికే అట ఈ రుణమాఫీ పైసలన్నా పడ్డయి అంటే బీఆర్ఎస్ పార్టీ నిలదీయడం వల్లనే అని ఆయన గుర్తు చేశారు.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అనేది పెద్ద మోసం నిరుద్యోగ యువత పై అరాచకం చేస్తున్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకు రాజ్యంగా ఫలాలు దక్కకూడదా రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పట్టుకొని తిరుగుతాడు, రేవంత్ మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నడు రాహుల్ గాంధీ ఎక్కడున్నావు, ఆరు గ్యారెంటీల బాధ్యత నాది అని చెప్పిన సోనియా గాంధీ ఎక్కడున్నారు. అధికారం వచ్చాక పత్తా లేకుండా పోయారు.కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలి. ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలి అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, రెటినేని ముత్యాపు రావు, మునగాల అంజి రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, వంగాల కృష్ణ రెడ్డి, రమావత్ దామోదర్, మద సుధాకర్ గౌడ్,దేపవత్ నరేందర్, రవి కుమార్,రమావత్ రవి నాయక్,విష్ణువర్ధన్ రెడ్డి,కిషన్,చైత్యన,తదితరులు ఉన్నారు.

---

## అయ్యప్ప స్వాముల అన్నప్రసాద కార్యక్రమం

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి ఆలయానికి సందర్శించి,స్వామి వారిని దర్శించుకొని, అయ్యప్ప స్వాములు మరియు వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి 38వ అయ్యప్ప స్వామి మాలధారణ సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం ఎమ్మెల్యే గారిని అయ్యప్ప స్వామి సేవ ట్రస్ట్ వారు శాలువాతో సత్కరించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అద్భుతమైన విజయాన్ని అందుకోవాలని అయ్యప్ప స్వామి సేవ ట్రస్ట్ వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, PACS చైర్మన్ జాల నర్సింహా రెడ్డి, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, సీనియర్ నాయకులు శిరందాస్ కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, కౌన్సిలర్ జయ ప్రకాష్, మాజీ సర్పంచ్ ముచర్ల గిరి,నాయకులు ఎల్లయ్య,యువ నాయకులు సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

---

## చేనేత అవగాహన సదస్సు



**జయభేరి, కరీంనగర్ :**

కరీంనగర్ చేనేత సహకార సంఘం పద్మనగర్ ఆధ్వర్యంలో చేనేత అవగాహన సదస్సు టూరును సహాయ సంచాలకులు చేనేత & జౌళి శాఖ అధికారి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించినారు నేను 50 మందితో కలిసి హుజురాబాద్ చేనేత సహకార సంఘంను సందర్శించి అందులో పనిచేస్తున్న మహిళా కార్మికులు, మగ కార్మికులు మగ్గాలు నేయు విధానంను పనిచేయు విధానమును చూడడం జరిగింది.. మొగ్గం నేయు విధానం ద్వారా చేనేత పనిని నేర్చుకోవడానికి అవగాహన కొరకు రావడం జరిగింది. సొసైటీ నెంబర్ గడ్డం శ్రీరాములు, తాటి రాజేశం, మోర రాజేశం, మల్లేశం, బూర మురళి, నల్ల చంద్రశేఖర్, రుద్ర శ్రీనివాస్, వేముల పురుషోత్తం, పిస్కా మల్లికార్జున్, దేవసాని రవి, శ్రీపతి కిషోర్ కుమార్, తదితరులు చాలామంది పాల్గొన్నారు.

# మూవీభేరి



## సమంత రియాక్షన్ ఇదే

ఇండియాలో ఉన్న టాప్ సెలబ్రిటీల్లో ఒకరిగా నిలిచింది సమంత. ఈ భామ ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. తెలుగులో ఒక ప్రాజెక్ట్ లైన్‌లో పెట్టిన సామ్ ఇప్పటివరకు స్టార్ యాక్టర్‌తో సినిమా మాత్రం ప్రకటించలేదు. సామ్ ప్రస్తుతం ఆదిత్యారాయ్ కపూర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న రక్త్ బ్రహ్మాండ్ చేస్తోంది. సమంత నటించిన తాజా హిందీ వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. ఈ నెల 8 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అభిమానులతో చిట్ చాట్ చేసింది. పర్‌ఫెక్ట్ కమర్షియల్ సినిమాలను ఎందుకు చేయడం లేదని ఆస్ మీ ఎనీథింగ్ సెషన్‌లో ఓ అభిమాని సమంతను ప్రశ్నించాడు. దీనికి సామ్ స్పందిస్తూ.. తాను ఇక రొటీన్, రెగ్యులర్ డ్యాన్స్ కమర్షియల్ సినిమాలను చేయనని చెప్పింఇ. అంతేకాదు తాను ప్రస్తుతం ఎక్కువగా నటనకు ఆస్కారమున్న సరైన స్క్రిప్టులను ఎంపిక చేసుకునే దశలో ఉన్నానని చెప్పుకొచ్చింది. సో ఇకపై సమంత నుంచి రెగ్యులర్ సినిమాలు కాకుండా.. కొత్తదనంతో కూడిన పర్‌ఫార్మెన్స్ ఓరియెంట్ సినిమాలకే సామ్ చేయబోతుందన్నమాట. రాజ్‌డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టులో కేకే మీనన్, సిమ్రన్, సోహం మజుందార్, శివంకిత్ పరిహార్, కశ్వీ మజుందార్, సాఖిబ్ సలీం, సికిందర్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సిటడెల్‌ను రాజ్ & డీకే D2R Films బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రాజ్ &డీకే, సీతా మీనన్ కథనందించారు.



## మర్డర్ వెనక మిస్టరీ

జోశర్మ ప్రధాన పాత్రలో నటించిన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ 'ఎమ్4ఎమ్' (మూటీవ్ ఫర్ మర్డర్). స్వీయ దర్శకనిర్మాణంలో మోహన్ వడ్లపట్ల రూపొందించారు. త్వరలో తెలుగుతో పాటు ఐదు భాషల్లో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఈ చిత్రాన్ని తీశాను. ఇప్పటివరకు ఈ తరహా కథాంశం తెలుగు తెరపై రాలేదు. ఓ కిల్లర్ నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కించాం. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వసంత్ ఇసాయిపట్టై, నిర్మాణం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.



## కొత్త ప్రతిభకు ప్రోత్సాహం

తెలుగు సినీరంగంలో ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో రూ పొందించిన 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్‌సైట్‌ను అగ్ర నటుడు ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఫొటోను షేర్ చేశారు. 'మీ కథల ను ఈ వేదిక ద్వా రా పంచుకోండి. మంచి కథలతో మీ ప్రతిభను ప్రపంచానికి తెలియజేయండి. మీ కథలతో కలల్ని నిజం చేసుకునేందుకు ఇదొక మంచి వేదిక' అంటూ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. 'రచయితలు తమ స్క్రిప్ట్‌ను 250 పదాల నిడివిలో 'ది స్క్రిప్ట్ క్రాఫ్ట్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు. అత్యధిక రేటింగ్ పొందిన స్క్రిప్ట్‌లను టాప్ ప్లేస్‌లో ఉంచుతాం. మా వెబ్‌సైట్ తొలి ప్రయత్నంగా మీ ఫేవరేట్ హీరోకు సూపర్‌పవర్స్ వస్తే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్‌లను ఆహ్వానిస్తున్నది' అని వెబ్‌సైట్ ఫౌండర్స్ ప్రమోద్ ఉప్పలపాటి, వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్, సలార్ 2, కల్కి 2 చిత్రాలతో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలతో బిజీగా ఉన్నారు.

## త్రిబాణధారి బార్బరిక్

పౌరాణిక కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఘటోత్కచుడి కుమారుడైన బార్బరికుడి నేపథ్యంలో ఈ సినిమా రాబోతున్నది. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, సత్యం రాజేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ పతాకంపై విజయపాల్ రెడ్డి అదిధాల నిర్మిస్తున్నారు.

బుధవారం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏకకాలంలో మూడు బాణాలు వేయడంలో బార్బరికుడు నేర్పరి అని, అందుకే టైటిల్‌లో త్రిబాణధారి అని పెట్టామని, పౌరాణిక, సమకాలీన అంశాల మేళవింపుతో ఆకట్టుకునే వినూత్న కథాంశమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేష్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బ్యాండ్, సమర్పణ: మారుతి టీమ్ ప్రొడక్ట్, రచనదర్శకత్వం: మోహన్ శ్రీవత్స.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com